International Journal for Multidisciplinary Research (IJFMR)
E-ISSN: 2582-2160 ● Website: www.ijfmr.com ● Email: editor@ijfmr.com

# ఎలక్ట్రానిక్ మీడియా ` సమకాలీన పరిణామాలు, పోకడలు


**డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్**

MA (Telugu), MA (English), M.Com, M.J.M.C, B.Ed, NET, M.Phil, (Gold Medal) Ph.D
తెలుగు లెక్చరర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పామర్రు, కృష్ణాజిల్లా



**Abstract**

ఎలక్ట్రానిక్ మీడియా ప్రపంచాన్ని ఒక గ్రామం గా మార్చింది. సోషల్ మీడియా విస్తరణతో ప్రేక్షకులు, సామాన్యులకు కూడా ఒపీనియన్ షేరింగ్ కి అవకాశం కలిగింది. తద్వారా ప్రజాస్వామ్యం విజయవంతం అయ్యేందుకవసరమైన చైతన్యం, ప్రజల భాగస్వామ్యం పెరిగింది. మీడియా లో సామాజిక భాద్యత కన్నా, పక్షపాత వైఖరి,వ్యాపార దృక్పధం, లాభోద్దేశం పెరిగడం మంచిదికాదు. ఫోర్త్ ఎస్టేట్ లా ప్రజల పక్షాన నిలబడాలి. సత్యమే పరమావధి గా పనిచేయాలి. స్వీయ నియంత్రణ, సమదృక్పధం లను రెండు నేత్రాలుగా భావించి మెరుగైన వ్యవస్థ కోసం సేవలందించాలి.


ఆధునిక కాలంలో ప్రపంచాన్ని ఒక గ్రామంగా, 'నూతన సమాజంగా' మార్పు చెందించడంలో ప్రసార సాధనాల పాత్ర ప్రధానమైనది. 1990 దశకంలో పారంభమైన ప్రపంచీకరణ, సరళీకరణ, మరియు ప్రైవేటీకరణ విధానాల నేపథ్యంలో 'ఎలక్ట్రానిక్ మీడియా' వేగవంతంగా అభివృద్ధి చెందింది. గత దశాబ్దంలో మొదలైన 'డిజిటలైజేషన్ ప్రక్రియ' ప్రభావంతో మీడియా ప్రసారాల్లో ఖచ్చితత్వం, నాణ్యతతో పాటు వాణిజ్యధోరణి కూడా పెరిగింది. ఫలితంగా పలు విభిన్న కార్యక్రమాల రూపకల్పన, తక్షణ ప్రసారాల సంఖ్య విశేషంగానే పెరిగాయి. ఇటీవల 'సోషల్ మీడియా' రంగం ఇంతింతై, వటుడిరతై అన్నట్లుగా, దినదినాభివృద్ధిని సాధిస్తోంది. సమస్త ప్రపంచాన్ని, మానవాళిని ప్రభావితం చేస్తోంది. ఈ రోజున రాష్ట్ర, దేశ, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల తీరుతెన్నులలో పెనుమార్పులు తెచ్చింది. భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలక వేదికగా మారింది. అయితే ప్రజాప్రయోజనాత్మక వార్తాంశాల కంటే సంచలనాత్మక, వ్యాపారాత్మక విషయాలకు ప్రాధాన్యం పెరుగుతుండడం శ్రేయస్సు కాదనే విమర్శలను దృష్టిలో పెట్టుకోవాలి. వివిధ ఛానళ్ళ మధ్య అవాంఛనీయ పోటీ పరిస్థితులు లేకుండా ఉండేలా సమతౌల్యంతో కూడిన వ్యవస్థగా ముందుకు సాగాలి. 'వసుధైక కుటుంబం' అనే ప్రజాస్వామ్య భువన భవనానికి మూలమైన 'నాలుగో స్తంభం'గా ప్రజల పక్షాన నిలబడేలా పనిచేయాలి. ప్రస్తుతం వందల సంఖ్యలో ప్రసారమౌతున్న భారీ ప్రైవేటు ఛానెళ్ళు, జాతీయ, ప్రాంతీయ టి.వి. ఛానెళ్ళు ఇంతగా అభివృద్ధి చెందడంలో ఆధునికకాలంలో విజయవంతమైన పలు కమ్యూనికేషన్ శాటిలైట్ లు, శాటిలైట్ స్టేషన్ ల పాత్ర మరువరానిది. మానవుని మేధస్సుకు గీటురాయిగా చెప్పుకోగల్గిన ఈ ఎలక్ట్రానిక్ మీడియా ఆవిర్భావం మానవునిలోని మంచిని, మానవత్వాన్ని పెంపొందించేందుకు పరిశ్రమించాలి. 1980ల నాటికి ప్రభుత్వరంగం నడిపే 'దూరదర్శన్' మాత్రమే ఉండగా, నేడు 24 గంటలూ నిరంతరం వార్తలనందించే పలురకాల టి.వి.ఛానళ్ళు కోకొల్లలుగా విస్తరించాయి. దూరదర్శన్ జాతీ ఛానెళ్ళతో పాటు, ప్రాంతీయ

భాషల్లో కూడా ప్రసారాలు అందిస్తోంది. సామాజిక బాధ్యతతో వివిధరకాల విద్య, విజ్ఞాన కార్యక్రమాలూ (జ్ఞానదర్శన్, జ్ఞానదర్శన్2 మొదలగు) గ్రామీణ, నిరుపేద వర్గాలకు సైతం అందేలా ప్రయత్నిస్తోంది. బ్రాడ్ కాస్టింగ్, బ్రాడ్ బాండ్ లలో ఆధునిక టెక్నాలజీ ప్రవేశించడంతో అనేక దేశాలలో ఏకకాలంలో వీక్షించగలిగే స్టార్ టివి గ్రూపుకు చెందిన ఛానెళ్ళు, డిస్కవరీ, నేషనల్ జియోగ్రఫిక్, ఈ.ఎస్.పి.ఎన్, పోగో, సి.ఎన్.ఎన్, బి.బి.సి. వరల్డ్, ఎఫ్, జి, ఎమ్, హెచ్.బి.వో. వంటి పలు రకాల టి.వి. ఛానెళ్ళు ఆవిర్భావం, అభివృద్ధి శరవేగంగా జరిగాయి. లైవ్ షోలు, బ్రేకింగ్ న్యూస్, ఆన్`లైన్ డిస్కషన్ ప్రోగ్రామ్స్ వంటి కార్యక్రమాలు సర్వసాధారణమైపోయాయి. సూర్యగ్రహణం, భూకంపాలు, తుఫాన్లు వంటి సంఘటనలతోపాటు, శివరాత్రి, రంజాన్, క్రిస్మస్, శ్రీరామనవమి వంటి పండుగలను కూడా ఏకకాలంలో, ఒకే ఛానల్లో సవివరంగా చూడగలిగేలా ప్రసారం చేస్తున్నారు. నిర్భయ అత్యాచార సంఘటన, అన్నా హజారే అవినీతి నిర్మూలన, ఇటీవలే చేపట్టిన 'స్వచ్ఛభారత్' వంటి కార్యక్రమాలు విజయవంతం కావడంతో ఎలక్ట్రానిక్ మీడియా పాత్ర విశేషంగానే ఉందనేది వాస్తవం. ప్రపంచవ్యాప్తంగా క్రీడలు, సాంస్కృతిక, సంప్రదాయాలతో కూడిన ఉత్సవాలూ, బిగ్ బ్యాంగ్ ఉదంతం, ఉగ్రవాద సంబంధిత బాంబు ప్రేళుళ్ళ వంటి సంఘటనల పట్ల కూడా ప్రజలకు సత్వర సమాచారాన్ని అందజేస్తున్నాయి. ఫలితంగా ప్రపంచంలోని సుదూరప్రాంతాల వారినందర్నీ దగ్గరగా చేర్చి అంతరాలనూ, అపోహలను తగ్గించి ప్రపంచాన్ని చక్కని 'గ్లోబల్ విలేజిగా' రూపొందించడంలో మీడియా శక్తివంతంగా కృషిచేయ గల్గుతున్నది.

'ఎలక్ట్రానిక్ మీడియా' నిర్వహణ దాదాపు ప్రయివేటు, పెట్టుబడిదారీ వర్గాల గుత్తాధిపత్యంలోకి వెళ్ళడం ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న ప్రధానమైన పరిణామం. 1997లో ఏర్పడిన ప్రసారభారతిగానీ, దూరదర్శన్ వంటి ప్రభుత్వరంగ ఛానెళ్ళు గానీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో వెనుకబడిపోతున్నాయి. కార్యక్రమాలలో కూడా వినోద ప్రధానంగా లేకపోవడం, ఆకర్షణీయంగా రూపొందకపోవడం, జరిగిన సంఘటనలను ఎక్కువ చేసి చూపడం, డిజిటల్ టెక్నాలజీ అనుభవం గల నిపుణుల కొరత మొదలగు కారణాల వల్ల ఈ రోజుల్లో కూడా రేటింగ్ లోనూ, రన్నింగ్ లోనూ ప్రయివేటు కార్పొరేట్ ఛానెళ్ళతో పోటీ పడలేక సతమతమౌతున్నాయనేది వాస్తవం. ప్రసారభారతి ఆధ్వర్యంలో సుమారు 200 బ్రాడ్ కాస్టింగ్ సెంటర్ ద్వారా 23 భారతీయ భాషల్లో రేడియో కార్యక్రమాలు, వెయ్యికి పైగా టి.వి. ట్రాన్స్మిటర్ ల ద్వారా టి.వి. కార్యక్రమాలు ప్రసారం చేయబడుతున్నా, కార్యక్రమాల్లో నూతనత్వం, ప్రసారాల్లో నాణ్యత లోపిస్తున్నదనే విమర్శకు కారణాలు తెలుసుకొని, పరిష్కారం దిశగా అడుగులు వేయాలి. ఇందుకు అవసరం అయిన నిధులు కేటాయింపులో పెంపు, నిపుణులైన సిబ్బంది లభ్యత, నియామకం, ప్రణాళిక వ్యూహాలను సమర్థంగా అమలు చేయాలి.

సోషల్ మీడియాలో యూట్యూబ్, షేర్చాట్, వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ లాంటివి పాపులర్ అయ్యాయి. గూగుల్ మీట్, జూమ్ మీటింగులు, వీడియో కాలింగ్ మొదలగు సౌకర్యాలు పెరిగాయి. 2020లో కరోనా విజృంభణతో సమస్త మానవాళికి మనుగడకి పెనుముప్పు సంభవించిన విపత్కర పరిస్థితుల్లో కరోనా నివారణ, నియంత్రణ, నిర్మూలన కార్యక్రమాల్లో సోషల్ మీడియా పాత్ర విశేషమైనది. సోషల్ మీడియా ద్వారా యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కూడా లభిస్తున్నాయి.

ఇక ప్రయివేటు, కార్పొరేట్ టి.వి. ఛానెళ్ళు లాభార్జన దృష్టితో పనిచేస్తున్నాయనీ, అలా కాకుండా సామాజిక బాధ్యతను మరింతగా తీసుకొని, ప్రజా ప్రసారాల సంఖ్యలను పెంచాలనే ప్రజాసంక్షేమం దిశగా కృషిచేయాలనే వాదన ఇటీవల పెరుగుతున్నది. ఎన్నికల ప్రచారం సమయంలో, ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే పలు సంఘటనల విషయంలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా

వ్యవహరించడం లేదనేదనే విమర్శ ఉంది. సీరియళ్ళు, లైవ్ షోలతో ఆకట్టుకొనే క్రమంలో వేషధారణ, భావజాలం, చిన్నపిల్లలతో సముచితంకాని అసభ్య నృత్యాలు, విందులూ వినోదాలు, విలాసాలతో కూడిన ప్రోగ్రామ్ లు అధికమయ్యాయని, ఎంతో కీలకమైన 'ప్రసార సమయం' దుర్వినియోగం అవుతున్నదని వీటి వల్ల మేలు కన్నా కీడే అధికమనే వాదన ఉంది. ఆధునికత పేరుతో ప్రక్కదోవ పడుతున్న సంస్కృతి, నాగరికతలు విషయంలో స్వచ్ఛంద సంఘాలు, మేధావుల అభ్యంతరాలను ఎలక్ట్రానిక్ మీడియా పట్టించుకోవడం లేదనేది మరో విమర్శ. వార్తల ప్రసారం కన్నా వ్యాపార, ప్రచార ధోరణులే అధికమయ్యాయని, పేద, గ్రామీణ వర్గాల విస్తృత ప్రయోజనాలకు పెద్దగా ప్రాధాన్యం ఉండటం లేదన్న అపవాదు ప్రైవేటు టి.వి. చానెళ్ళపై ప్రముఖంగానే వినిపిస్తున్నది. పర్యవసానంగా పౌరసమాజంలో వ్యక్తివాద జీవనశైలి, పాశ్చాత్య నాగరికతా వ్యామోహనం పెరిగి, మానవతా విలువలు, బాధ్యతలతో కూడిన యువతరం తగ్గిపోతున్నదనేది కాదనలేని సత్యంగా చెప్పవచ్చు.

ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు శరవేగంగా, ఉధృతంగా అభివృద్ధి చెందిన రంగం సోషల్ మీడియా. ప్రస్తుతానికి అన్నింటిలోనూ దీనిదే ఆధిపత్యం. ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి చిహ్నంగా నిలిచిన శాటిలైట్లు ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టాబ్‌లు, వైఫై టెక్నాలజీ, 5జి టెక్నాలజీ, ఫైబర్ నెట్ వంటి రంగాల అభివృద్ధి ప్రత్యేకంగా, పరోక్షంగా సోషల్ మీడియా ఆవిర్భావానికి, అభివృద్ధికి దోహదపడిరది. సోషల్ మీడియా ప్రభావం పాలుత్రాగే నెలల వయస్సున్న పసిపాపల నుంచి, ఎంతో పేరుప్రఖ్యాతులు సంపాదించి, అరవైల వయస్సు దాటిన వృద్ధుల వరకూ అందరిపైనా పడిరది. సోషల్ మీడియాను అత్యంత కీలకమైన పరికరం అయిన మొబైల్ ఫోన్లు లేకుండా గంటసేపు కూడా ఉండలేనంతగా విస్తృతిలోకి వచ్చింది. సోషల్ మీడియా జీవితంలో ఒక భాగంగా, దినచర్యగా మారింది. అందుకే ఎన్నికల వేళల్లో కూడా సోషల్ మీడియా కంటెంట్ పబ్లిసిటీ కీలకపాత్ర పోషిస్తుంది. గెలుపోటములను కూడా నిర్ణయిస్తోంది. ప్రజాచైతన్యం పెరిగి, ప్రజాస్వామ్యం విజయవంతంగా అయ్యేందుకు సోషల్ మీడియా చాలావరకూ దోహదపడుతోంది. పత్రికొక్కటున్న పదివేల సైన్యం' అన్నది ఎంతటి అక్షర సత్యమో, సోషల్ మీడియా లోనే సొసైటీ తీరుతెన్నులు ప్రభావిత మౌతాయన్నది అంతే పరమ సత్యం. ఒకప్పటి ఎలక్ట్రానిక్ మీడియా నుంచి, నేటి సోషల్ మీడియా వరకూ నెలకొన్న మాధ్యమాల వ్యవస్థ నేడు కొందరికి ప్రధాన వినోదం, కొందరికి వార్తిక సాధనం. కొందరికి పరిపాలనా మాధ్యమం, కొందరికి కాలక్షేపం. కొందరికి వ్యాపారం, కొందరికి వ్యసనం. కొందరికి జీవితనోపాధి, కొందరికి విజయ సోపానం. ఒక్కమాటలో చెప్పాలంటే సామాజిక మాధ్యమాలు లేనిదే సామాజిక వ్యవస్థే లేదన్నంతగా ప్రముఖ పాత్ర వహిస్తోంది.

అయితే సోషల్ మీడియా అనూహ్య అభివృద్ధి కారణంగా దాని ప్రభావం ప్రింట్ మీడియాపైన కాస్త ప్రతికూలముగానే పడిరదని చెప్పాలి. ముఖ్యంగా సితార, స్వాతి వంటి వారపత్రికలు, ఇతర మాస పత్రికలపైన దీని ప్రభావం ఎక్కువగా ఉంది. వార, మాస పత్రికల పాఠకులు చాలావరకూ తగ్గిపోయారు. ఇదేదో గత తరం వారి వ్యాపకంగా భావించాల్సిన పరిస్థితి వచ్చింది. సోషల్ మీడియాలో కూడా కథలూ, కథానికలు, పరిశోధనా వ్యాసాలు, ఇతర సమాచారం లభిస్తుండటంతో ప్రింట్ మీడియా పరిధి క్రమంగా తగ్గుతోంది. విద్య, వైద్యం, స్వభావాత్మకత, పరస్పర సమాచార మార్పిడి మొదలగునవి సామాజిక మాధ్యమాల ద్వారానే అత్యంత స్పష్టంగా, వేగంగా, నాణ్యతతో జరుగుతుందన్నది వాస్తవం. భారత ప్రధాని శ్రీ నరేంద్రమోడి గారు 2016, నవంబరు 8న భారతదేశం అంతటా నోట్ల రద్దు (డీమానిటైజేషన్) నిర్ణయాన్ని ప్రకటించినప్పుడు దేశమంతటా ఆన్ లైన్, యూ.పి.ఐ చెల్లింపులు, నగదు లావాదేవీలు తప్పనిసరిగా చేసుకోవాల్సి వచ్చింది. 2016లో డిజిటల్, ఆన్ లైన్ నగదు లావాదేవీలు అంటే సామాన్య

ప్రజానీకానికి సాధ్యమేనా? అని మేధావులు, విద్యావంతులు సైతం అందోళన చెందారు. అప్పట్లో 10% మంది కూడా వినియోగించలేని పరిస్థితి ఉండేది. కానీ సోషల్ మీడియా, సెల్ ఫోన్‌లు పరస్పరాభివృద్ధి కారణంగా ఫోన్ పే, గూగుల్ పే, పేటీయమ్ లాంటి యాప్‌లను ప్రస్తుతం దేశంలో సుమారు 70% మంది వినియోగించగలుగుతున్నారంటే అందుకు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల అభివృద్ధి ఫలితమే అని చెప్పాలి.

ప్రస్తుతకాలమాన పరిస్థితుల నేపథ్యంలో 'ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వ్యవస్థలు, తన పరిధిని, పాత్రను సమీక్షించుకోవాలి. ప్రజాసేవా ప్రసారాలు, గ్రామీణ, పేద వర్గాల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని, సమతౌల్యంతో వ్యవహరించాలి. రాజకీయ, వర్గ, ప్రాంతీయ ప్రాధాన్యాలు ప్రక్కన పెట్టి స్వయంప్రతిపత్తితో, సమదృక్పథంతో ముందుకు సాగాలి, పారదర్శకత, అవినీతిరహిత సమాజ స్థాపనలో బృహత్తర భూమిక పోషిస్తున్న మీడియా రంగంలో అక్కడక్కడ బ్లాక్ మెయిలింగ్ ధోరణులు, సిబ్బందిలో అవినీతి ఆస్కార బావనలు చోటు చేసుకుంటున్నాయన్న అపవాదును తొలగించుకోవాలి. నూతనంగా ప్రవేశించిన 'ఇన్ఫోటైన్‌మెంట్' ప్రక్రియలో ప్రసారాలు రూపొందించడంతో పాటు, మానవీయ విలువలను, సామాజిక బాధ్యతను పెంపొందించే ప్రసారాలు పెంచాలి. వార్తల ప్రసారంలో 'అతివ్యాప్తి ` అవ్యాప్తి దోషాలను నివారించాలి. టి.ఆర్.పి. రేటింగ్‌లు, మార్జిన్‌లు కోసం కాకుండా రెచ్చగొట్టే రీతిలో కాకుండా, నిర్మాణాత్మకంగా ప్రజాసేవలో ముందడుగు వేయాలి. ఆంధ్రప్రదేశ్ వంటి పలు రాష్ట్రప్రభుత్వాలు తమ పాలనా సౌలభ్యం కోసం 'వాట్సాప్ గవర్నెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నాయి. ప్రయివేటు, కార్పొరేటు సంస్థలుకూడా మెయిల్ సిస్టమ్ కన్నా వాట్సాప్ లాంటి సోషల్ మీడియా వేదిక ద్వారానే తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం అమెరికా, రష్యా లాంటి దేశాల అగ్రనేతల దగ్గరనుండి, కరోనా నియంత్రణలో ప్రపంచదేశాలకే ఆదర్శంగా నిలిచిన బారతదేశ ప్రధాని శ్రీ నరేంద్రమోడీ గారి వరకూ ఎంతోమంది దేశాధినేతలూ, రాష్ట్రాధినేతలు, ప్రముఖులూ, స్వచ్ఛంద సంఘాలవారూ సోషల్ మీడియా ద్వారానే ప్రకటనలు, స్పందనలు ప్రజలకు అవసరం అయిన సమాచారాన్ని తెలియజేస్తున్నారు. అందుకే ప్రజాస్వామ్యానికి ఫోర్త్ ఎస్టేట్ లా కొనియాడబడుతున్న ఈ మీడియా వ్యవస్థలు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలి. నిర్వహణా స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయకుండా ఆత్మప్రబోధం మేరకు వ్యవహరిస్తూ సామాజిక సామరస్యాన్ని పరిరక్షించేలా ఉండాలి. మారుమూల ప్రాంతాల్లో చిన్న చిన్న జన సమూహాలూ, భాషాసముదాయాలు, సంస్కృతులూ, వాటి మనుగడకు విఘాతం కల్గించకుండా, చేతనైనంతగా వాటికి ప్రాచుర్యం కల్పించి అభివృద్ధి చెందేలా ప్రసారాలు రూపొందించాలి. 'స్వీయ నియంత్రణ' మరియు 'సమదృక్పథం' లను రెండు నేత్రాలుగా పనిచేస్తూ, మెరుగైన వ్యవస్థ నిర్మాణంలో ఎలక్ట్రానిక్ మీడియా మరియు సోషల్ మీడియా ముందుండి నడిపించాలి.

కృతజ్ఞతలతో

**- డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్**